అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు

టీజీఎస్–పీడీసీఎల్ నార్త్ జోన్ సీజీఎం చక్రపాణి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాత్ర ఎంతో ఉందని టీజీఎస్–పీడీసీఎల్ నార్త్ జోన్ సీజీఎం చక్రపాణి అన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ముషీరాబాద్ ఏఈ బి.శాంతారావు ఆత్మీయ వీడ్కోలు సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీజీఎం చక్రపాణి మాట్లాడుతూ... అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందన్నారు. 36 సంవత్సరాలు దిగ్విజయంగా సేవలను పూర్తిచేసుకొని పదవి విరమణ చేసిన శాంతారావు సుఖసంతోషాలతో జీవించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాంతారావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ వెంకన్న, డీఈ కమల్ కుమార్, ఏడీఈలు వినోద్ కుమార్, శ్రీనివాస్, సీనయ్య, 1104 విద్యుత్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, కార్యదర్శి ప్రభాకర్, రీజనల్ ప్రెసిడెంట్ అంజిరెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో రిటైర్డ్ ఏఈ శాంతారావు దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

ముగిసిన కార్తీక మాసోత్సవాలు



లక్ష్మీగణపతి దేవాలయంలో అన్నపూజలో కార్పొరేటర్ పావని దంపతులు







నల్లకుంట: కార్తీక మాసోత్సవాల్లో చివరి రోజైన ఆదివారం అంబర్‌పేట నియోజకవర్గంలోని శైవ క్షేత్రాల్లో శివుడికి ప్రత్యే అభిషేకాలు, పూజలు నిర్వహించారు. న్యూనల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి దేవాలయంలో ఉదయం శివుడికి అభిషేకం కావించారు.ఈ సందర్భంగా పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు చేశారు. హారతులు ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. సాయంత్రం శివుడికి పూజలు నిర్వహించి హారతులు ఇవ్వడంతో కార్తీక మాసోత్సవాలు ముగిశాయి.

'అన్నాభిషేకం'..

టీఆర్టీకాలనీ శ్రీవిజయ గణపతి దేవాలయంలో శనివారం సాయంత్రం శివుడికి అన్నాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ కావించారు.

కుసుమ హరనాథ ఆశ్రమంలో..

నల్లకుంట డివిజన్ టీఆర్టీ కాలనీలోని కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆదివారం మాసోత్సవం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని రాధాకృష్ణులు, కుసుమ హరనాథులకు ప్రత్యేక హారతులు ఇచ్చారు. అలాగే ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులచే భజన నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలి

10న కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ గందరగోళంగా తయారైందని..అయోమయ స్థితిలో విద్యార్థులు ఉన్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 16.75 లక్షల మంది విద్యార్థులకు ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు వేముల రామకృష్ణా, టి.రాజేందర్, రామకోటి, నందగోపాల్, రవికుమార్‌యాదవ్, ఉదయ్‌గౌడ్, నిరంజన్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలధారణ భక్తిభావనను పెంపొందిస్తుంది

కవాడిగూడ: అయ్యప్పస్వామి 41 రోజుల మాలధారణ దైవ భక్తిని పెంపొందించడానికి దోహదపడుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. అయ్యప్పభక్తుల దీక్ష ఆరోగ్యానికి, క్రమశిక్షణతోపాటు భక్తి భావం అలవడుతుందన్నారు. కవాడిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పేరుస్వామి వల్లాల శ్యామ్‌యాదవ్‌తోపాటు అయ్యప్పస్వాముల బృందం డివిజన్‌లోని భాగ్యలక్ష్మినగర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సన్నిధానంలో గురుస్వామి ప్రత్యేక పూజలతో ఇరుముడి కట్టుకొని శబరిమలైకి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, వై.శ్రీనివాస్‌రావుస్వామి, స్వామిశంకర్ ముదిరాజ్, ప్రభాకర్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇతర జిల్లాల ఆటోలను నిషేధించాలి



ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్నయూనియన్ ప్రతినిధులు

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమంగా తిరుగుతున్న ఇతర జిల్లాల ఆటోలను నిషేధించాలని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూనియన్ అధ్యక్షుడు ఎస్.నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గోడ మల్లేష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం నారాయణగూడలోని కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఆటో డ్రైవర్ల అభివృద్ధి కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. అర్హత కలిగి ఆటో డ్రైవర్లకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో శబంకర్, దయానంద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ నేత బ్రహ్మచారి మృతి



అంబర్‌పేట: బీఆర్ఎస్ సీనియర్ నేత పడకంటి బ్రహ్మచారి ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. అంబర్‌పేట, ప్రేమ్‌నగర్ ప్రాంతానికి చెందిన బ్రహ్మచారి బీజేపీ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసి పార్టీ అభివృద్ధి కోసం పనిచేశారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన బ్రహ్మచారి కొంత కాలంగా ప్రజలకు తనవంతు సేవలందిస్తూ మంచి నాయకుడిగా గుర్తింపు పొందారు. పడకంటి బ్రహ్మచారి మృతిపట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ బ్రహ్మచారి కుమార్తె హరిప్రియాతో ఫోన్‌లో మాట్లాడి సంతాపం తెలియజేశారు. స్థానిక బీఆర్ఎస్ నేతలు, బీజేపీ నేతలు, వివిధ పార్టీల నేతలు, బంధు మిత్రులు పాల్గొని ఆయన పార్థీవదేహానికి నివాళులర్పించారు.

ప్రజాపాలన వేడుకలను విజయవంతం చేయాలి

ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్



కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి అనిల్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా చేపట్టిన ప్రజాపాలన వేడుకలను విజయవంతం చేయాలని, సంక్షేమ పథకాలకు విస్తృత ప్రచారం కల్పించాలని రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గ విస్తృత స్థాయి పార్టీ నాయకుల, కార్యకర్తల సమావేశం ఎంపీ కార్యాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అనిల్‌కుమార్‌యాదవ్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రజా పాలన పేరిట 9వ తేదీ వరకు తలపెట్టిన సంబరాల్లను విజయవంతం చేయాలని కోరారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం 53 వేల ఉద్యోగాలను భర్తీ చేసి నూతన ఆత్మవిశ్వాసం కల్పించిందని తెలిపారు. ఆర్థిక సమస్యలు అధిగమించి హామీలను అమలు చేస్తూ ప్రజల కోసం ప్రభుత్వం పని చేస్తుంటే బీజేపీ, బీఆర్ఎస్ లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. విభజన హామీలు ఎందుకు అమలు చేయడం లేదో బీజేపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. 7వ తేదీన అన్ని డివిజన్‌లు, నియోజకవర్గాల్లో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించాలని, 8న మెగా బైక్ ర్యాలీలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజాపాలన కోఆర్డినేటర్ గౌరీ సతీష్, అభిషేక్ కెనడీ, అంజియాదవ్, వెంకట్, మెడి సురేష్, వెంకటేష్, లింగాల శ్రీకాంత్‌గౌడ్, కరణం సురేష్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా మున్నూరుకాపు వనభోజనాలు

కాచిగూడ: తెలంగాణ మున్నూరుకాపు మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు చామకూర సుజాత నేతృత్వంలో ఆదివారం కార్తీక మాస వనభోజనాలు నిర్వహించారు. కాచిగూడలోని మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు సభ్యులు పిల్లి శ్రీనివాస్ రావు, మహిళా కమిటీ ప్రతినిధులు ఆకుల మంజు, పిల్లి అన్నపూర్ణ, కోశికే జయశ్రీ, సృజన, స్రవంతి, శాంతి ప్రియా, జ్యోతి లక్ష్మీ, ఆది శ్రీలేఖ, నందిగం అన్నపూర్ణ, జయశ్రీ, సరిత, పూజ, ఆది రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

7న ప్రతిభా పురస్కారాల ప్రదానం

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో 2024లో డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. ఈనెల 7వ తేదీన కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్య హాల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొ. ఎంఆర్ వెంకట్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా తండ్రిని, సంరక్షకులను కోల్పోయిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తామని అన్నారు.

22న శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవం

నల్లకుంట: శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ 22వ వార్షికోత్సవాన్ని ఈనెల 22న నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక భక్తి సంగీత 'స్వరార్చన'కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు, ఆలిండియా, టీవీ కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణమూర్తి, నందినిల పర్యవేక్షణలో తమ అకాడమీ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విద్యార్థులకు శ్రీకృష్ణ పరమాత్ముని భక్తిగీతాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే కోలాటం కూడా ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థులతో కలిసి వన భోజనాలు కూడా ఉంటాయని తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైంది



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైందని విద్యార్థులను నిర్మాణాత్మకంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంటుందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో అంబర్‌పేట మండల్ రికగ్నైజ్‌డ్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీలో టాపర్ విద్యార్థులకు అవార్డులతో పాటు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... నేడు బతుకు నేర్పేవాడే బడి పంతులని అన్నారు. ఇప్పుడు ఉన్న వ్యవస్థలో ఉపాధ్యాయులే కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మంచి విద్యను అందించడంలో ప్రైవేటు విద్యాసంస్థలు చేసిన కృషి అభినందనీయం అని అన్నారు. టాలెంట్ ఎవరి సొత్తు కాదని విద్యార్థులు అంకిత భావంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు జె. రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి రవి, సలహాదారులు రవికుమార్, ఉపాధ్యక్షులు నిరంజన్, కోశాధికారి శోభారెడ్డి, కార్పొరేటర్లు అమృత, పద్మావెంకటరెడ్డి, ప్రైవేటు పాఠశాలల ఫీజు నియంత్రణ కమిటీ అధ్యక్షులు బి. దీపక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యార్థులనుసత్కరిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

వడ్డెరుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణలో వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు వారి ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపాటి జైపాల్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వడ్డె ఓబన్న తెలంగాణ వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జైపాల్ మాట్లాడుతూ... వడ్డెరులు ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకోవాలంటే తమ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. ఐక్యమత్యంతో వడ్డెరులందరూ ముందుకు సాగి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

◆ భారతీయ వడ్డెర సమాజ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు డా. వెంకటేష్ మౌర్యా మాట్లాడుతూ... కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఆధునిక భారతదేశ నిర్మాణంలో వడ్డెర కులం అత్యంత కీలక పాత్ర పోషించిందన్నారు. ఇకనైనా వడ్డెర కులస్తులు మేలుకొని తమ జాతీ అభివృద్ధి కోసం అంకిత భావంతో పనిచేయాలని కోరారు. తమ స్వార్థాన్ని పక్కన పెట్టి ఐక్యమత్యంతో తమ హక్కుల సాధనకోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, ప్రధాన కార్యదర్శి సంపంగి ప్రభాకర్, యూత్ ప్రసిడెంట్ కొమ్ము రాజశేఖర్, మహిళా అధ్యక్షురాలు డేరంగుల రూప,కార్యదర్శి శివరాత్రి వెంకటేష్, కొమ్ము రాజుల రాజు, కర్ణాటక అధ్యక్షులు జగన్నాథ్, డి. సమ్మయ్య, సల్లంగుల కృష్ణయ్య పాల్గొన్నారు.



వడ్డెరుల సదస్సులో అభివాదం చేస్తున్న ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపాటి జైపాల్

కార్మికులకు కనీస వేతనాలు పెంచాలి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కార్మికులందరికీ కనీస వేతనాలు పెంచాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) తెలంగాణ అధ్యక్షుడు వి.కృష్ణ అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వివిధ రంగాలలోని కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనేక ఆశలతో, ఆకాంక్షలతో కాంగ్రెస్ ప్రభుత్వానికి కార్మికవర్గం ఓటు వేశారని, అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మికుల సమస్యలను పెడచెవిన పెట్టిందని విమర్శించారు. ఇంత వరకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిని నియమించకపోవడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి కార్మికుల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.సూర్యం, ఉపాధ్యక్షులు ఎస్ఎల్ పద్మ, ఎం.హన్మేశ్, నరేందర్, కె.రాజన్న, రామయ్య, సి.వెంకటేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టియూసీఐ తెలంగాణ అధ్యక్షుడు వి.కృష్ణ

ఎల్ఐసీ కాలనీ సమస్యలను పరిష్కరించండి

కవాడిగూడ: డివిజన్ ఎల్ఐసీ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని స్థానికుల కార్పొరేటర్ రచనశ్రీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఎల్ఐసీ కాలనీలో పర్యటించి నేరుగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ కాలనీ నూతన అధ్యక్షుడు కుమార్, కార్యదర్శి రాకేష్, రాఘవ, విశాల్, కళ్యాణ్‌గౌడ్, వేణు తదితరులు కాలనీలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్‌కు విన్నవించారు. ఎల్ఐసీ కాలనీ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన బోరింగ్ పనిచేయడంలేదని, గత లోక్‌సభ ఎన్నికల ముందు ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పర్యవేక్షణ లోపించి చెత్తాచెదారంతో పేరుకుపోయిందని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా మెయిన్‌రోడ్‌పై ఉన్నపార్కులో ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగిన పాములకు నిలయంగా మారిందన్నారు. కాలనీలో పాములు రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జి. రచనశ్రీ మాట్లాడుతూ... ఎల్ఐసీ కాలనీలో నెలకొన్న సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఐసీకాలనీలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ రచనశ్రీ

ప్రభుత్వాన్ని గద్దె దించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి

జీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో 16లక్షల 75 వేల మంది విద్యార్థులు ఫీజులు కట్టలేక విద్యకు దూరమవుతుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ విమర్శించారు. ఆదివారం నారాయణగూడలో విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. విద్యార్థులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వమే ఆటంకం కల్గిస్తోందని ఆయన ఆరోపించారు. పనులు కాకున్నా కమీషన్ల కోసం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారే తప్ప విద్యార్థులను పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ ప్రజా, విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పగిళ్ళ సతీష్, వంశీ, చంద్రశేఖర్, మోదీ రాందేవ్, నర్సింహ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహ గర్జనకు తరలిన మాలబస్తీ

చిక్కడపల్లి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మాలల సింహ గర్జనకు గాంధీనగర్ యువజన సంఘం మాల బస్తీవాసులు తరలివెళ్లారు. అంతకు ముందు డా. బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మాలబస్తీ నాయకులు జీఎస్ మధుసూదన్, జి.వెంకటేష, ఎం.సునిల్, జె.మదన్‌మోహన్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగంలోని 341 ఆర్టికల్‌కు వ్యతిరేకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాలబస్తీ నాయకులు జి.జగదీష్, టి.శ్రీనివాస్, ఎన్.నాగరాజు, జె.రాంబాబు, పి.మల్లేష్, కె.ముకేష్ , బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీగీతాల విభావరి

చిక్కడపల్లి: గంగోత్రి కల్చరల్ ఫౌండేషన్, సీల్వెల్ కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సినీగీతాల విభావరి కార్యక్రమం ఆదివారం రాత్రి ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సిటీ కల్చరల్ సెంటర్‌లో ప్రేక్షకులను అలరించింది. ఈ సందర్భంగా యువ గాయనీ గాయకులు వెంకీ, సింధూ, ఆనంది తమ పాటలతో అలరించారు. ఈ సందర్భంగా గాయకులను విశిష్ట అతిథులుగా విచ్చేసిన ప్రవీణ్, పారిజాత అభినందించారు. సీల్వెల్ అధినేత బండారు సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుర గాయని సంస్థ కార్యదర్శి గంగోత్రి దేవన్షి, ఉపాధ్యక్షురాలు సుజాతలు పాల్గొన్నారు.

మెకానిక్‌లకు ఉచిత వైద్య శిబిరం

ముషీరాబాద్: స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాంనగర్‌లోని రాజ్ ఫంక్షన్‌హాల్‌లో ముషీరాబాద్ టూ–వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో టూ–వీలర్ మెకానిక్‌లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, రక్త పరీక్షలు, ఆర్థోపెడిక్, న్యూరాలజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. 200ల మంది మెకానిక్‌లకు పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌గౌడ్ మాట్లాడుతూ.. మెకానిక్‌లు అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రైవేటు వైద్య సంస్థలు ఉచిత వైద్య శిబిరాల నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధులు వాసుబాబు, జవార్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు సీతాబాలకృష్ణ, జగదీష్, కోశాధికారి వెంకట్‌బాలరాజు, ఉపాధ్యక్షులు బల్లా ప్రశాంత్, ఎస్వీరెడ్డి, నాయకులు రాఘవరాజ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరలో శాస్త్రీయత ఏది?



బాధిత రైతు కుటుంబాలకు ఆర్థికసాయం అందజేస్తున్న కోదండరెడ్డి, జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతుధరను శాస్త్రీయంగా నిర్ధారించడంలేదని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎ.కోదండరెడ్డి అన్నారు. రైతు కుటుంబాల రెక్కలకష్టాన్ని కూడా ఖర్చులకు కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించాలని కోరారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో 5వ వార్షికోత్సవ సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ముఖ్యఅతిథి కోదండరెడ్డి మాట్లాడుతూ... కనీసవేతన చట్టం, విత్తన చట్టం రైతులకు అనుకూలంగా మార్చాలని, సహకార వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించాలని కోరారు. తెలంగాణ రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ.. అశాస్త్రీయమైన పారిశ్రామిక విధానాలు, మందుల వాడకంతో పంటలు కూడా విషతుల్యం అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త బాబూరావు, ప్రొ.వినాయకరెడ్డి, సాగరాబేగం, వెంకటేష్, న్యాయవాది లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ వెంకటరాజయ్య, సైనాల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

'6 అబద్ధాలు.. 66 మోసాలు'

కాంగ్రెస్ ఏడాది పాలనపై బీజేపీ వినూత్న కార్యక్రమం

నల్లకుంట: కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై బీజేపీ ఆధ్వర్యంలో '6 అబద్ధాలు.. 66 మోసాలు'నినాదంతో ఆదివారం నల్లకుంటలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్. గౌతంరావు ప్రారంభించి మాట్లాడారు. ఈ ర్యాలీ డివిజన్ పరిధిలోని నల్లకుంట మెయిన్ రోడ్డు, రత్నానగర్, సత్యనగర్, తిలక్‌నగర్ రోడ్డు, గోల్నాక మార్కెట్ తదితర ప్రాంతాలలో సాగింది. ఈ సందర్భంగా ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అములులో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వనం రమేష్, నాయకులు శ్యామ్‌రాజ్, నర్సింగ్ రావు, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

కాచిగూడ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ఆదివారం బర్కత్‌పురలో బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతంరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్‌లో అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్, ఆనంద్‌గౌడ్, ఎ.అజయ్‌కుమార్, సుభాష్ పటేల్, యశ్వంత్, జ్యోతి, జగన్, కృష్ణాగౌడ్, ఎస్.అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



నల్లకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు డాక్టర్ ఎస్.గౌతంరావు, వనం రమేష్ తదితరులు



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు